
# ప్రయాణం

— ఇంద్రగంటి జానకీబాల



కమలిని ఫస్టుక్లాసు కుపేలో కూర్చునుంది. రెండో సీటు ఎవరో స్త్రీకే యిచ్చారు. ఆషాఢమాసం రైలు చాలావరకు ఖాళీగా వుంది. తన సూట్‌కేసు చిన్న బ్యాగ్ సీటు మీదే పెట్టేసి కిటికీ దగ్గరగా జరిగి బయటకి చూస్తోంది కమలిని. ఇంకా రైలు బయలు దేరేందుకు పావుగంట సమయముంది. ఆమె సందిగ్ధంగా అటూ యిటూ ప్లాట్‌ఫారం వైపు చూస్తోంది.

శంకర్ తనకు వీడ్కోలు చెప్పడానికి రాలేదు. రాడని తనకి తెలుసు. తనసీని, తన ఉనికినీ పట్టించుకోని, పట్టించుకోవడం యిష్టంలేని వ్యక్తి శంకర్. అలాంటివాడు తనేదో ఊరు వెళ్తోందంటే అతనొచ్చి తనకి వీడ్కోలు చెప్తాడనుకోవడం అత్యాశ. కానీ కమలిని కళ్లు ప్లాట్‌ఫారం వైపు చూస్తూనే వున్నాయి.

రైలు కదిలేందుకు ఇంకా పదినిముషాలుంది. లైట్లు వెలిగి పట్టపగలులా వుంది—రైల్వే స్టేషన్.

'నేనెందుకతని కోసం వెదకాలి? నేను అక్కరలేదను కున్న మనిషికోసం నేనెందుకు పాకులాడాలి?' అని గట్టిగా పైకే అనేసుకుని తల విదిలించింది కమలిని. పుస్తకాల బండి వస్తే ఒక మాగజైన్ కొని తిరగేస్తూ కూర్చుంది.

ఇంతలో హడావిడిగా ఆమె వచ్చి రైలెక్కింది—లోప లికొచ్చి సూట్‌కేసు బెడ్డింగు సర్ది, కమలిని వంక చూసి మెత్తగా స్నేహంగా నవ్వింది—చటుక్కున కిటికీ దగ్గరకు వెళ్ళి ప్లాట్‌ఫారమ్ మీద వున్నతనికి వీడ్కోలు చెప్పింది. రైలు నెమ్మదిగా కదిలింది.

కమలిని చూపులు ఆఖరు సారిగా ప్లాట్‌ఫారమంతా వెదికాయి. ఆమె కళ్ళు మూసుకుని వెనక్కి జారగిల పడింది.

రెక్కలొచ్చి స్వేచ్ఛాలోకాల్లోకి ఎగిరిపోతున్న భావన ఒక్క క్షణం కలిగింది. అంతలోనే సుడిగాలిలో రెక్కలు తెగి ఒంటరిగా సముద్రంలో రాలిపోతున్న భావన కూడా కలిగింది.

కమలిని కళ్ళు తెరిచి చూసింది. రైలు, స్టేషను వదిలింది.

ఎదురుగా ఆమె బెర్తుమీద దువ్వటి పరచుకొని, దిండు పెట్టుకుని నీట్‌గా సర్దుకుంది.

కమలిని లేచి వాటర్ బ్యాగ్ లోంచి నీళ్ళు వొంపుకుని తాగింది. ఆమె మళ్ళీ పలకరింపుగా నవ్వడంతో దొరికిపో యిన దొంగలా సన్నగా నవ్వి "మీ పేరేమిటి?" అని అడిగింది.

"నాన్సీ" అంది.

"ఎక్కడికి వెళ్తున్నారు?"

చెప్పింది నాన్సీ. కమలిని మళ్ళీ ఒక్క క్షణం ఆలోచనలో పడింది.

తనెన్నో సార్లు హాయిగా, శంకర్‌తో జంటగా ఎన్నో ఊళ్ళు తిరగాలనుకుంది గానీ, అతనెప్పుడూ తనని పట్టించుకోలేదు. ఎప్పుడూ తనొక్కడే ఎక్కడికెళ్ళినా వె ళ్ళిపోయేవాడు. తనెంత బతిమాలినా ఏదోసాకు చెప్పే వాడు. తన సాంగత్యం పట్ల అతను చూపిస్తున్న అయిష్ట తకి తనెంత తల్లడిల్లిపోయేది? అవమానపడేది? పొరు షపడేది? ఫలితం! తనుకన్నీళ్ళతో వెనక్కి తగ్గిపోతే అతను దర్జాగా యీలవేసుకుంటూ సూట్‌కేస్ పట్టుకుని వెళ్ళిపోయేవాడు.

కమలిని కళ్ళల్లో సన్నటి కన్నీటిపొర.

కండక్టర్ వచ్చి సీట్లకింద చూసి—

"ఈ మధ్య కొందరు దొంగలు రైలు బయలుదేరటా నికి ముందే ఫస్టుక్లాసు పెట్టెల్లో సీట్లకింద చేరి నిశ్శబ్దంగా పడుకొని రైలు బాగా స్పీడందుకున్నాక ప్రయాణీకుల్ని బెదిరించి దోచుకుంటున్నారు" అన్నాడు నవ్వుతూ. కమలిని నవ్వింది. నాన్సీ కూడా నవ్వింది—అప్పుడు చూసింది కమలిని—నాన్సీ చాలా అందంగా వుందని. అరటి దూటలాంటి శరీరచ్ఛాయ, ఆరోగ్యకరమైన అవయవ సంపద. నవ్వేటప్పుడు సొట్టలు పడే గులాబీ బుగ్గలు. నిమ్మళంగా, నిండుగా వుండే ఆమె నవ్వుచూ స్తే ఆమె స్నేహమయి అని తెలుస్తోంది.

కమలిని తన బాధని పక్కకి నెట్టి నాన్సీతో కబుర్లలో పడింది. నాన్సీలో చిలిపితనం, అల్లరితనం లేదు. హుందాగా, గంభీరంగా వుంది. నిండా చూస్తే పాతిక సంవత్సరాలుంటాయనిపించలేదు. ఆమె రూపాన్ని బట్టిచూస్తే ఆమె చాలా చలాకీ, ఎలిపి అమ్మాయను కుంది. కానీ మాటల్లో పడ్డాక అభిప్రాయం మార్చుకుంది కమలిని. నాన్సీ కళ్ళల్లో అనుభవం తాలూకు నీలినీడలు న్నాయి.

రైలు చాలా వేగంగా ముందుకు దూసుకుపోతోంది. నాన్సీ పొలిథిన్ బ్యాగ్‌లోంచి రెండు స్వీట్లు, ఒక కేక్, ఒక అరటిపండు యిచ్చింది.

కమలిని ఆశ్చర్యంగా చూసి "ఇదేమిటి" అంది.

"మీకు అసలుకారణం చెప్తే... మరి ఎలా అర్థం చేసుకుంటారో" అంది నాన్సీ.

"ఫరవాలేదు చెప్పండి."

""ముందు తినేయండి చెప్తాను" అంది. ఆ చెప్ప టంలో కొంచెం చమత్కారం—కొంత విషాదం, భయం వున్నాయని కమలినికి అనిపించింది. కానీ అంతలోనే తనని తనే విమర్శించుకుంది. వచ్చుకొమెర్లవాడి సామెత గా తన దృష్టి, ఆలోచనా మారిపోవటం లేదుకదా! అనుకుంది.

తినడం మొదలు పెట్టి నవ్వుతూ నాన్సీవైపు తిరిగి అంది.

"మీకంత ఆనందం కలిగించిన విషయమేమిటో తెలుసుకోవాలనివుంది—."

నాన్సీ కొంతసేపు నిశ్శబ్దంగా కిటికీలోంచి బయటికి చూసి, చటుక్కున కమలినికేసి తిరిగి—

"నాకు నా భర్త నుండి విడాకులు లభించిన రోజు. ఈ రోజుతో అతనికీ నాకూ ఏ విధమైన సంబంధమూ లేదు—" అంది.

నిజంగా కమలిని గతుక్కుమంది. ఆమె ఏ కోశానా ఊహించని విషయం—ఊహించని దృక్కోణం. వెంట నే ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. అలా అని వెంటనే ఏదో ఒకటి మాట్లాడలేకపోయింది. అభినంద లు తెలియజెయ్యడానికి ఏదో సంకోచం, తర తరాల సంప్రదాయపు సంకెళ్ళు ఆమెను బంధించాయి. ఆమె

వంక తదేకంగా చూసింది. వెంటనే తనలో తాను సర్దుకుంది—తనకంటే నాన్సీ ఎన్నోరెట్లునయం. తనలో సాహసం, దృఢనిశ్చయం లేవు.

కమలిని నెమ్మదిగా "సారీ నాన్సీ! మీ సంతోషం అర్థం చేసుకోగలను గానీ యింత చిన్న వయస్సులోనే మీరు జీవితంలో ఎదురు దెబ్బతిన్నందుకు బాధగా వుంది" అంది. నాన్సీ చిన్నబుచ్చుకోలేదు. "ఆ బాధంతా మర్చిపోయాను... నిజం! నేనా సంకెళ్ళనుండి బయట పడతానా అని భయపడ్డాను—కానీ బయటపడ్డాను"—నెమ్మదిగా తన కథ చెప్పడం మొదలు పెట్టింది.

"విలియమ్స్, నేనూ ప్రేమించి ఒకరంటే ఒకరు యిష్టపడి పెళ్ళి చేసుకున్నాం. అయితే మగవాడు పెళ్ళికి ముందు ఎంత తెలిసినా పెళ్ళయినాక అతని అసలు రూపం తెలుస్తుందని నాకు తర్వాత తెలిసింది. ఒక్కటి గుర్తుంచుకోండి. మగవాడు వేరు. మొగుడు వేరు. మగవాడుగా ఎంతో మంచిగా వున్నవాడు మొగుడుగా మారగానే దుర్మార్గుడైపోతాడు." నాన్సీవాదం కమలినికి చిత్రంగా అనిపించినా, అవాస్తవంగా అనిపించలేదు. ఆమె తన అనుభవంలోంచి కొన్ని సత్యాలు చెప్తోందనిపించింది.

"విలియమ్స్ అంత డబ్బుమనిషని నేను పెళ్ళి అయిన నెల్లాళ్ళ వరకూ గ్రహించలేకపోయాను. అతనికి నామీద, నా ఆరోగ్యంమీద, నా సౌఖ్యంమీద, నా మనసుమీద వున్న యిష్టాలకంటే అతనికి డబ్బుమీద వున్న యిష్టం చాలా రెట్లు ఎక్కువని నాకర్థమైంది—

"అతను నేనంపాదించే జీతం లెక్కలు వేసి నా ఖర్చులు తీసేసి, మిగిలినది అతని చేతిలో పొయ్యాలనే నియమం చేశాడు. మొదట్లో అది నాకేమంత బాధ అనిపించలేదు. కానీ క్రమేణా అది నా ఖర్చుమీద కూడా నిఘాగా మారింది. నేను ఉద్యోగానికి వెళ్ళినప్పుడు ఎన్నిసార్లు కాఫీతాగాలి. పక్కనెవరైనా వుంటే ఎలా అదికూడా మానెయ్యాలి—అంటూ రోజూ నాకు పాఠాలు మొదలుపెట్టాడు. నేనతని మాటలకి పెద్దగా ప్రాముఖ్యం యివ్వలేదు. అయితే అతను వదల్లేదు. నాజీతం పైసలతో సహా లెక్కలడిగి వేధించటం మొదలు పెట్టాడు. నేను విసుక్కున్నాను.

"నువ్వు సంపాదించే ప్రతి పైసా మీదా నాకే అధికారం వుంది. నీకు కాదు" అన్నాడు—నేను సహించలేకపోయాను. మా మధ్య రోజూ ఘర్షణ జరుగుతూ వుండేది. నెమ్మదిగా అతనిలోని సర్వ లక్షణాలూ బయటపడటం మొదలు పెట్టాయి. రెండు మాటల తర్వాత అతను పశువులా మీద పడి కొట్టేవాడు. నేనెంతో కంగారు పడ్డాను. మా అమ్మా నాన్నా నన్నే తిట్టారు. "కావాలని చేసుకున్నావు. అతనొక దెబ్బ వేస్తే మాత్రం నీ మీద ప్రేమ లేకుండా పోతుందా-నువ్వు ఓర్చుకోవాలి" అనడం మొదలు పెట్టారు. రోజూ దెబ్బలు భరించటం నావల్ల కాలేదు. నిజంగా నా తమ్ముడు నాకు అండగా నిలిచి నన్ను మళ్ళీ మనిషిని చేశాడు. ఆరునెలల్లో నేను నరకం ఎలా వుంటుందో అనుభవించాను.

వద్దు బాబూ. ఏడేడు జన్మలకి సరిపడినంత అనుభవమిచ్చాడతను. ఇప్పుడు నాకు మగవాడంటే అసహ్యం, భయం" ఆమె మాటలు చాలా తీవ్రంగా వున్నాయి.

నాన్సీ, కమలినీ మంచి స్నేహితులయ్యారు. ఇద్దరూ భోజనాలు ఆర్డరు చేసుకుని తిన్నారు—కమలిని బయటకి మామూలుగా వున్నా ఆమె మనసులో చితాగ్ని రగులు కుంటోంది. నాన్సీ పడిన వేదనకి తన వేదనేం తీసిపోదు. కానీ ఎందుకు తనింకా పట్టుకు వేలాడుతోంది. ఈ ప్రశ్నకి ఒక్కటే జవాబు. చేతకాక-ధైర్యం లేక.

"పోనీలే చిన్న పిల్ల మీరు. రేపు మళ్ళీ పెళ్ళి చేసుకున్నా ఫరవాలేదు" అంది కమలిని.

"అదేమీ లేదండీ—ఇదేమైనా ఖాళీ అయిన సీటును భర్తీ చెయ్యడమా? తల్చుకుంటేనే అసహ్యంగా వుంది" అంది నాన్సీ.

ఏ మతమైనా, ఏ కులమైనా, ఏ జాతైనా, ఏ దేశమైనా స్త్రీ పురుషుల సంబంధం ఒకలాగే వుంది. పురుషుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శించటానికి, దౌర్జన్యం చేయటానికి ఏ దేశమైతేనేం?—

కమలినికి రవి—రమ గుర్తు కొచ్చారు. వారు అన్యోన్యంగా వుంటారు. తనొస్తున్నట్లు టెలిగ్రాం అందగానే యిద్దరూ ఆనందిస్తారు. రవి స్టేషన్‌కొస్తాడు. ఆ తర్వాత

> స్త్రీ పురుషుణ్ణి ప్రేమించినంత మాత్రాన ఆమె తన ఆత్మగౌరవాన్ని కోల్పోనవసరం లేదు. ప్రేమ బానిసత్వం కాదు. పురుషుడు ప్రేమ పేరుతో స్త్రీ పట్ల ఆధిక్యత చూపాలనుకోవడమూ అవివేకమే అవుతుంది. కానీ 'నిజమైన ప్రేమ' స్వరూపం ఎంతమంది పురుషులకు తెలుస్తుంది?

నిజానికి తన గురించి తనేమీ ఆలోచించుకోనవసరం లేదు—నిజానికి రవి ఎవరు?

శంకర్ ప్రాణ స్నేహితుడు. పెళ్లి అయిన తర్వాత శంకర్ పరిచయం చేస్తే, పరిచయమై ఎంతో సన్నిహితుడయ్యాడు. రమ కూడా ఎంత స్నేహం నెరిపింది. తన నుండి ఏమీ ఆశించకుండా కేవలం మంచి మిత్రులుగా, తోబుట్టువులుగా—అంత కంటే ఎక్కువగా ఆత్మీయులై పోయారు. నిజంగా తను వస్తున్నట్లు తెలిస్తే రవి ఎంత సంబరపడతాడు?

'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీ కోసము కన్నీరు నించుటకు' అన్న శ్రీశ్రీ మాటలు తనకెన్ని సార్లు గుర్తు కొస్తాయి? ఆ పాటలోని మాటలు తన గుండె నెంత కోస్తాయి?—మాట లెంత తియ్యగా వుంటాయి. ఎంత వాడిగా వుంటాయి. కానీ మనసులు, మనుషులు అలా వుండవు.

కమలిని నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది. అదీ కలత నిద్రే. అంతర్లీనంగా ఆలోచనలు సాగుతూనే వున్నాయి. ప్రేమించుకున్నాం—అని చాటుకుని పెళ్ళి చేసుకున్నాక నాన్సీ విషయంలో అతనంత దారుణంగా ఎందుకు ప్రవర్తించినట్లు? శంకర్ మాత్రం తనంటే యిష్టపడి, కట్నకానుకలు వద్దని, తల్లిదండ్రుల్ని ఎదిరించి తనే కావాలని చేసుకోలేదూ? మరెందుకింతటి తిరస్కారం జరిగింది. తను బతికుండగానే, ఆరోగ్యంగా తిని తిరుగుతుండగానే, తనని పక్కకి నెట్టి మరో ఆడదాన్ని పెళ్ళి చేసుకునే స్థితికి వచ్చిన మగాడితో తనింకా కలిసి ఎందుకు బతుకుతోంది? చేతకాకా? మరో మార్గం లేకా?—తనంత తాను బతకగలననే ధైర్యం లేకనా?—ఇవన్నీను. ఇంకెవరితోనైనా ఈ జీవితం పంచుకుందామనే ఆలోచన తనకెందుకు రాలేదు? పోనీ ఈనాటికీ శంకర్నే మనసా ప్రేమిస్తున్నానని రూఢి ఏమీ వున్నట్లు లేదే! తనని నిర్లక్ష్యం చేసిన భర్తనే ప్రేమిస్తూ ఏ స్త్రీ కూర్చోదు. కానీ మనసూ శరీరం చచ్చిపోయినా, భర్తతోనే బతికేస్తోంది. ఎందుకు? ఎందుకు? ఎందుకు?—

కమలిని ఉలిక్కిపడి లేచింది. రైలేదో స్టేషన్‌లో ఆగివుంది. లేచి మంచి నీళ్ళు తాగి బెర్తు మీద వొరిగింది. నాన్సీ హాయిగా నిద్రపోతోంది. ఆ ముఖం నిండా ప్రశాంతత. మరో నాలుగు గంటల్లో రైలు కలకత్తా చేరుతుంది. కమలినికి ఒక్కసారి దుఃఖం ముంచుకొచ్చింది. తనెందుకిలా నాశనమైపోయింది? ఇందులో తన బాధ్యత ఎంతవరకుంది? తనూ అందరిలాగే ఎంతో అపురూపంగా, కలలు కంటూ వివాహ జీవితంలోకి అడుగు పెట్టింది. కానీ, అర్నెల్లు తిరక్కుండానే శంకర్ అసలు స్వరూపం బయటపడింది. అతనికి ప్రేమ అనేదే లేదని—ఆడదాని కొంగు తగిలితే మంత్రించినట్లు అటు వెళ్ళి పోతాడని అర్థమైంది. అయినా తనేం చేసింది? ఆత్మ గౌరవం చంపుకుని అతనితో కాపురం చేస్తూనే వుంది. ఈ ముప్పై అయిదేళ్ళ వయసుకే తన మనసు పూర్తిగా చచ్చిపోయింది. మొన్న శంకర్ అన్నిటికీ తెగించి ఒకామెని పెళ్ళి చేసుకున్నాడు. తను కోర్టు కెళ్తే తనకేం దక్కుతుంది? మరింత అప్రతిష్ఠ—అల్లరి. తను భరించలేని సానుభూతి. అంతే గానీ విరిగిన తన మనస్సు అతుక్కోదు. వాడి రేకులు రాలిపోయిన హృదయకుసుమం మళ్ళీ వికసించదు. తను వాతావరణం మార్పు కోసం యిలా బయలు దేరింది. అతనిలో తను వెళుతున్నాననే బాధగానీ, బాధ్యతగానీ లేదు, ఇంతటి తన జీవితంలో పరిపూర్ణంగా తనకే చెందిన ఒక్క వ్యక్తిని సంపాదించుకోలేక పోయింది.

ఉండుండీ కమలినిని దుఃఖం కమ్మేస్తోంది. కన్నీరు వరదలై ప్రవహిస్తోంది. రైలు వేగంగా పరుగెడుతోంది.

రైలు ప్లాట్‌ఫారం మీదకి వచ్చి కూడా పరుగెడుతూనే వుంది. ఏటికి ఎదురీతలా కమలిని చూపులు ప్లాట్ ఫారం మీద ఎదురుపరుగెడుతూ, ట్రైన్ వేగంతో పోటీ పడుతున్నాయి.

దూరంగా, తెల్లని డ్రస్‌లో రవి కనిపిస్తే ప్రాణం కుదుటపడింది. రవి చూడనే చూశాడు. పరుగెత్తుకొచ్చాడు, రైలు ఆగింది. ఆమె కంపార్టుమెంటు గుమ్మంలో అతను నిలిచి వున్నాడు. ఎంత ఆనందం!—

కమలిని గుండె గుబగుబ లాడింది. అసలు తన కోసం ఎవరైనా జీవితంలో యిలా రావడం ఎంత కొత్త? ఇందులో ఎంత థ్రిల్—ఎంత ఆనందం?

కమలినిలో దుఃఖం పొంగి రాబోయింది. 'ఛీ! ఏమిటిది? ఏదో కొంప మునిగిపోయినట్లు, స్టేషన్‌లోనే ఏడిస్తే, అతనేమైపోతాడు?'—నెమ్మదిగా తమాయించు కుంది.

"నెమ్మదిగా దిగు" అంటూ చెయ్యి అందించాడు. కమలిని వొణుకుతున్న చెయ్యి అందించింది.

"ఈ చెయ్యి యింత వేడిగా వుందేమిటి?" అను కుంది కమలిని.

"ఈ చెయ్యిలా మంచులా వుందేమిటి?" అనుకున్నా డు రవి.

"ఈ ట్రయిన్ అరగంట లేటు తెలుసా! నిరీక్షించ టంలో వున్న బాధ యిప్పుడు తెలిసింది"—

అతన్ని కళ్ళెత్తి సూటిగా చూసింది కమలిని. అతని మాటలు, గొంతు కొత్తగా వినిపించాయి.

రవికి తనంటే ఎంతో అభిమానం, యిష్టం, గౌరవం. కానీ యింకేమీ కాదు. తనని తానుగా అభిమానించే వ్యక్తి రవి—మళ్ళీ గట్టిగా అనుకుంది.

"చాలా అలసిపోయినట్లున్నావు" అంటూ సామాను పోర్టర్ చేత పట్టించి నడవటం మొదలు పెట్టాడు. కమలిని వెనక్కి తిరిగి చూసింది. అప్పుడే నాన్సీ తన కోసం చూసి, నవ్వి చెయ్యి ఊపింది—కమలిని నాన్సీకి చెయ్యెత్తి వీడ్కోలు చెప్పింది. తను బ్యాగ్‌లో వడేసుకున్న నాన్సీ ఎడ్రస్ కార్డు మరొక్కసారి చూసుకుంది.

రవి డ్రైవింగ్ సీటులో కూర్చుని ముందు డోర్ తీశాడు. కమలిని ఎక్కి కూర్చుని డోర్ మూసింది. రవి డోర్ సరిగా వడలేదేమోనన్నట్లు కమలిని మీదుగా చెయ్యి పోనిచ్చి చెక్‌చేశాడు. ఆమెంత వెనక్కి సీటుకి అతుక్కుపోయినా, అతని చెయ్యి ఆమె గుండెల్ని తాకుతూ ప్రయాణించింది—కమలిని మూడ్ ఏదోలా అయింది.

"రమెలా వుంది?" అంది.

కారు స్టార్టయింది. అతను రెండు నిముషాలు నిదానంగా రోడ్డు వైపు పరిశీలనగా చూసి, స్టేషన్ అవుట్ గేటులోంచి సర్రున ఎడం వైపు మలుపు తిప్పాడు. కమలిని జాగ్రత్తగా నిలతొక్కుకుంది గానీ లేకపోతే పూర్తిగా అతని మీద పడిపోయేది. అతని పెదవుల మీద సన్నటి నవ్వు, చూపులలో కొంటెతనం వ్యూ మిర్రర్‌లోంచి చూసి ఆమె ఒక్క క్షణం కలవర పడింది.

"ఓ..... బ్రహ్మాండంగా వుంది" అన్నాడు.

"ఏమిటి?" అంది తడబడుతూ—

అతను ఫెళ్ళున నవ్వి ఓరకంట చూస్తూ "రమెలా వుందని అడిగావుగా" అన్నాడు. తన మతిమరుపుకి తనే చిరాకుపడిపోయింది కమలిని.

"రవీ! నువ్వు చాలా మారిపోయావు" అంది గుబులుగా.

"నేనా! మారానా! పోనీలే, ఆ మార్పేదో మంచి కోసమే అయివుంటుంది. అయినా మనుషులు మారకపోతే మానులు మారతాయా?" అన్నాడు.

అప్పుడే సూర్యుడు తన వెచ్చని కిరణాలు నాలుగు వైపులా పరుస్తున్నాడు—కారు మెత్తగా సాగిపోతోంది. కమలిని ఆలోచనల్లో మునిగిపోయి వుండగా, యిల్లు చేరింది. ఇంట్లో అడుగు పెడుతూనే రమ ఇంట్లో లేదని కమలిని గ్రహించింది. ఒక్కసారి అవమానంతో కుంచించుకుపోయింది. ఏదో తప్పుచేస్తున్నట్లు బాధ పడింది.

"రమ లేదని చెప్పలేదే" అంది. తన గొంతులో తొట్రుపాటు కనిపించకూడదని ప్రయత్నిస్తూ—

"ఏదీ—యింకా చెప్దామనుకుంటూనే చెప్పలేదు. అయినా ఇప్పుడేమైంది?"

"ఏమీ కాదులే. ఊరికే అడిగాను" అంది కమలిని. తనెక్కువగా ఉలికిపడుతున్నానేమోనని అనిపించిదామెకి.

రవి ఏనాటి మిత్రుడు? ఎంత మంచివాడు? ఎంత సంస్కారవంతుడు? తనే పిచ్చి ఊహలతో కలతపడుతోంది అనుకుంది లోలోపల.

స్నానపానాదులు కాఫీ టిఫెన్ అన్నీ అయ్యాక స్థిమితంగా సోఫాలో ఎదురుగా కూర్చుని చెప్పడం మొదలు పెట్టాడు రవి.

"అసలేం జరిగింది కమలా" అన్నాడు.

"ఏముంది జరగడానికి" అంది కమలిని.

"నువ్వేం చెప్పకపోయినా నాకన్నీ తెలుసు. నీకు జరిగిన అన్యాయం నీయందు శంకర్ చూపించిన నిరాదరణ ఆలోచిస్తే నా మనసంతా కుతకుతలాడిపోతోంది."

అతని నోటి వెంట వెలువడుతున్న ప్రతిమాటనూ కమలిని శ్రద్ధగా పరిశీలిస్తోంది.

"నేను రెక్కలు కట్టుకుని అక్కడికొచ్చి వాలాలనుకున్నాను. కానీ ఎలా కుదురుతుంది? నిత్యం నిన్ను తల్చుకుంటున్నా రాలేక పోయాను."

కమలిని జాగ్రత్తగా పరిశీలిస్తూంటే అతని మాటల్లో అతని గురించే గానీ అతని భార్య రమ ఫీలింగ్స్ లేవు.

"కమలినీ! నువ్వంటే నాకెంత యిష్టమో చెప్పలేను. స్నేహితుడి భార్యవయిపోయావని ఇన్నాళ్ళూ పెదవి విప్పలేదుగానీ, ఇంక ఆలస్యం చెయ్యడం అనవసరం. నీలాంటి అందగత్తె, తెలివైనదీ, అన్నిటికీ మించి మంచిదానిని—ఆ శంకర్ సరిగ్గా చూసుకోలేకపోయాడు. నువ్వింక వాడి గురించి ఆలోచనలు మానెయ్. నీకు నేనున్నాను"—రవి ఆవేశంగా మాట్లాడేస్తుంటే కమలిని అవాక్కయి చూస్తూండిపోయింది. తను కట్టుకున్న స్నేహ సౌధాలు పునాదుల్లోంచి కూలిపోతుంటే నిస్సహాయంగా, నిర్జీవంగా చూస్తూండిపోయింది.

ఏమిటి రవి మాట్లాడుతున్నది? తనిప్పుడు మరో మగాడి పొందు కోసం తపిస్తోందా? లేదే! చచ్చిపోయిన మనసూ, శరీరం మళ్ళీ జీవం పోసుకోవడం ఈ జన్మకి సాధ్యపడదు. తనకిప్పుడు కావల్సింది మనశ్శాంతి. నిష్కల్మషమైన స్నేహం—అంతే. కానీ ఇదేమిటీ వైపరీత్యం? ఇది తను ముందే ఊహించి వుంటే ఈ ఛాయలకి కూడా తను వచ్చేది కాదు. రవిలో ఇలాంటి ఒక రాక్షస ప్రవృత్తి దాగి వుందని తనెందుకు గ్రహించలేకపోయింది?

కమలినిలో దుఃఖం పొంగి పొంగి పొర్లింది. పరాయి మగాడు 'నువ్వంటే నాకిష్టం' అని ఒక స్త్రీని, అదీ పెళ్ళయిన స్త్రీని అవమానించగలిగాడంటే అది కట్టుకున్న మొగుడు యిచ్చిన అలుసు, లోసుగు. ఇన్నాళ్ళు తనని అవమానించలేని రవి, ఈ రోజు తనని శంకర్ బయట పెట్టగానే ముందు కొచ్చాడు. అంటే సీటు ఖాళీ అయిందని తెలిసి ప్రయత్నించటమేగా—'. ఒక్కసారిగా కమలినిలో క్రోధం కట్టలు తెంచుకుంది. ఆ క్షణంలో శంకర్ కనిపిస్తే చంపేయాలనే కసి, తెగువ ఆమెని ఊపేశాయి. శంకర్ మరొక ఆడదాన్ని పెళ్ళి చేసుకున్నప్పటికంటే తనని తృణీకరించినప్పటి కంటే యిప్పుడామెకి, భరించరాని అవమానం కలిగింది. ఆమె నిస్సహాయంగా చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది.

"రవీ! నీకు పిచ్చిగానీ పట్టిందా? నాతో ఎందుకలా అవమానకరంగా మాట్లాడతావు. నేనెప్పుడైనా అలాంటి దృష్టితో నిన్ను చూశానా" అంది ఏడుపు మధ్య.

"లేదు. నిజమే. కానీ ఇక ముందు నన్నా దృష్టితో చూడు"—

ఆమెకి వొళ్ళుమండి పోయింది. చెంప వగలగొట్టాలనిపించింది. అయినా తమాయించుకుంది. అతని వుద్దేశం, వాదన ఏమిటో తెలుసుకోవాలనిపించింది.

"మరి రమనేం చేస్తావు?" అంది క్రోధంగా, వ్యంగ్యంగా.

"ప్చ్! దాని మీద నాకెప్పుడూ మోజు లేదు. నేను దానితో సుఖపడిందీ లేదు. ఏదో కాలక్షేపం" అన్నాడు.

పరాయి ఆడదాన్ని వలలో వేసుకోవాలనుకున్న ప్రతి మగాడు భార్య గురించి మాట్లాడే మొదటి వాక్యమే అది—

కమలిని మనసు భగ్గున మండిపోయింది. ఆవేశంతో ఊగిపోయింది—

"కాదు. కానే కాదు. నీకే సుఖానికీ లోటు లేదు. ఇప్పుడు నా మీద మోజుతో, నా అసహాయస్థితిని అసరాగా తీసుకుని నన్ను మొగ్గులోకి లాగుతావు. రమ గుండెల్లో నిప్పులు పోస్తావు. ఇన్నాళ్ళు కాపురం చేసిన రమ పనికిరానిదానిగా అందర్లో ఆమెని అవమానిస్తావు. మళ్ళీ మరొక స్త్రీ ఇవే మాటలు రమతో అనే

అవకాశం కల్పిస్తావు. ఆమెని అవమానిస్తావు"—కమలిని ఆవేశంగా గొంతు చించుకుని అరిచింది.

రవి మాట్లాడలేదు—కొంచెం ఆగి—

"నువ్వు పూర్తిగా అలసిపోయి వున్నావు. విశ్రాంతి తీసుకో. నిన్ను నేను బలవంతం చేసి బాధిస్తానని కలలో కూడా అనుకోకు. నాకు నీ పరిపూర్ణమైన ప్రేమ కావాలి. నువ్వంటే నాకిష్టం" అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

"హూ-ప్రేమ" అని హుంకరించింది కానీ కమలిని పెనం మీంచి పొయ్యిలో పడిపోయినట్లు ఫీలయ్యింది.

మర్నాడు రమ వస్తూనే కమలిన్ని కౌగలించుకుంది. ఎన్నో కబుర్లు చెప్పింది. కానీ కమలిని రమతో స్వేచ్ఛగా మాట్లాడలేకపోయింది. తన తప్పేమీ లేకపోయినా తనొక తప్పుడు స్థితిలో వుండిపోయినందుకు అవమాన పడిపోయింది. హాయిగా, కులాసాగా కాలక్షేపం చేద్దామనుకుని వచ్చి కూడా మనసు విప్పి మాట్లాడలేకపోయింది—

రాత్రి గడిచింది. రమలో కొట్టొచ్చినట్లు మార్పు కనిపించింది. ముభావంగా వుంది. తనతో రవి ప్రవర్తన ఒక్కసారి చూసిన ఎవరికైనా అలాంటి అభిప్రాయం కలుగుతుంది. నిజానికి తనకా ప్రవర్తనతో సంబంధం లేకపోయినా అదెవ్వరికి కావాలి?

అసలు ఒక ఆడదాన్ని తనవైపు తిప్పుకోవాలనుకుంటే ఆమెకు తనకూ మధ్య చాలా దగ్గర బంధం వుందనే భావం చూసేవారికి కలిగించి, ఆమెని యిరకాటంలో పెట్టి, నెమ్మదిగా ఆమెని అసహాయురాల్నిచేసి, తన ప్రయత్నం సఫలం చేసుకుంటాడు మగాడు. అది అతను ఆడే దుర్మార్గమైన నాటకంలో మొదటి భాగం.

"రేపు వెళ్తాను రమా" అంది కమలిని.

రమ కళ్ళల్లో ఆశ్చర్యం, హేళన మిళితమైన చిరునవ్వు—

"ఏం? అప్పుడే ఎందుకు? రెండు రోజులుండి వెళ్ళు" అంది.

"లేదు. వెళ్ళాలి" అంది కమలిని కాస్త దృఢనిశ్చయంగా.

"సరే" అంది రమ. కమలిని వైపు నిశితంగా చూసి—

"మన కాపురం కూలిపోతే, ఆ బాధతో మరొకరి కాపురం కూల్చాలనుకోవడం న్యాయమా?" అంది. కమలిని మళ్ళీ అవమానంతో క్రుంగిపోయింది. ఆమె దగ్గర ఈ ప్రశ్నకి బోలెడు జవాబు వుంది. కానీ మాట్లాడబోతే దుఃఖం గొంతులో నిండి మాట పైకి రావడం లేదు. కానీ అప్పుడు తను మాట్లాడక పోతే రమలో అనుమానం స్థిరపడుతుంది. అది అబద్ధం. అది తను సహించలేని విషయం—అందుకే బలవంతంగా గొంతు పెగుల్చుకుని—

"రమా! నువ్వు నమ్మినా, నమ్మక పోయినా నేను ఎవ్వరి కాపురమూ కూల్చాలని రాలేదు. ముఖ్యంగా మీ యిద్దరినీ ఒక్కరిగానే చూశాను గానీ విడిగా చూడలేదు. నువ్వు ఏదైనా అనుకుంటే అది నా వైపు నుంచి వట్టి అపోహ మాత్రమే!" ఇలా అంటుంటే కమలిని కళ్ళు జలాశయాలయ్యాయి. తన గురించి తను చెప్పుకోవాల్సిన పరిస్థితి కంటే దుస్థితి మరొకటి లేదు. అలాంటి దుస్థితి ఏ స్త్రీకీ వద్దు. అంతకంటే అవమానం లేదీ ప్రపంచంలో అనుకుంది.

రమ రెప్పపాటులో కమలిని మానసిక స్థితి గ్రహించింది. ఆమెకీ కళ్ళ నీళ్ళు వచ్చాయి. తను తొందరపడిందనిపించింది. కమలిన్ని గట్టిగా కౌగలించుకుంది.

"నాకు తెలుసు. నాకు తెలుసు. నిన్ను అవమానించిన మగ బుద్ధిని నేను అర్థం చేసుకోగలను. నా తొందరపాటుకు క్షమించు. నిన్ను నేను ఎప్పటి నుంచో ఎరుగుదును" అంది ఆవేశంగా.

* * *


రైలు ఫ్లాట్‌ఫారం మీద ఆగి వుంది. రమ వచ్చింది స్టేషన్‌కి. నిజానికి ఆ రైలు కమలిని ఎక్కాల్సిన రైలు కాదు. కానీ ఆ రైలు ఎందుకెక్కుతోందో అడిగే ధైర్యం లేదు.

తన మాటకి అర్థం లేదని తెలిసినా "శంకర్‌కి టెలిగ్రాము యివ్వాల్సింది" అంది రమ.

కమలిని పేలవంగా నవ్వింది.

రైలు బయలు దేరింది. నీళ్ళు నిండిన కళ్ళతో రమ చెయ్యూపింది. కమలిని తన బ్యాగులో జాగ్రత్తగా దాచుకున్న నాన్సీ ఎడ్రసు కార్డు మరొక్కసారి చూసుకుంది. రమ వైపు తిరిగి చెయ్యూపింది. రైలు వేగాన్ని పుంజుకుంది. □

## వర్ధమాన గాయని
# భాగ్యలక్ష్మి



సంగీతంలో సన్మార్గాన్ని దర్శించింది కుమారి భాగ్యలక్ష్మి. అందువల్లే చిన్నప్పటి నుంచీ ఈ రంగంపై ఆసక్తిని పెంచుకుంది. తండ్రి శ్రీ బి. ఆర్. ఎస్. రెడ్డి (విశాఖ పోర్టుట్రస్టు), తల్లి శ్రీమతి సీతారత్నం ఆమెలో సంగీతం పట్ల గల ఉత్సాహాన్ని గుర్తించి ప్రోత్సహించారు. అందువల్లే చదువుకుంటున్నప్పుడే ఆమె పాటల పోటీలలో పాల్గొనడం ప్రారంభించింది. భాగ్యలక్ష్మి డా॥ వి. ఎస్. కృష్ణా ప్రభుత్వ కళాశాల విద్యార్థిని. బి. కామ్. పట్టభద్రురాలు. సంగీత రంగంలో భాగ్యలక్ష్మి సాధన ఏమిటి?

"నేను కాలేజిలోను, ఆంధ్ర విశ్వవిద్యాలయం, జెస్సి, లయన్స్ వంటి ప్రముఖ సేవాసంస్థలు నిర్వహించిన పాటల పోటీలలో పాల్గొని, పెద్దల ఆశీర్వాదాలతో పలు బహుమతులు గెల్చుకున్నాను. మొట్టమొదట 'విశ్వకళాస్రవంతి' ఆర్కెస్ట్రాలో సినీ నేపథ్యగాయకులు శ్రీ ఎన్. ఎస్. ప్రకాశరావు గారితో విశాఖపట్నంలో పాడుతుండేదాన్ని. ఆ బృందంవారు వివిధ పట్టణాలలో యిచ్చిన కార్యక్రమాలలో (సుమారు 500కు పైగా) పాల్గొన్నాను. సాంస్కృతిక కళామూర్తులకు ఆప్తబంధువు, నేషనల్ కల్చరల్ ఇంటిగ్రేషన్ కమిటీ రథసారథి, అయిన శ్రీ టి. వి. కె. శాస్త్రిగారు_సంగీతం పట్ల నాకున్న శ్రద్ధను చూసి, ముచ్చటపడి, జెంషెడ్‌పూర్, టాటానగర్‌లలో భారీ ఎత్తున నిర్వహించిన బాలాజీ కల్యాణోత్సవాలలో, సుప్రసిద్ధులైన శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, శ్రీమతి ఎస్. జానకిగార్ల సమక్షంలో నాచేత భక్తి పాటలు, మీరా భజనలు పాడి ప్రోత్సహించారు. అలా వారి ఆశీర్వాదాలు పొందడం నా అదృష్టం. ఆ తర్వాత జరిగిన కల్యాణోత్సవాలలోను, మద్రాసు తెలుగు అకాడమీ నిర్వహించిన ఉగాది ఉత్సవాలలోను, ఇతర పాటకచ్చేరీ కార్యక్రమాలలోను ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణ, జి. ఆనంద్, ఎస్. పి. శైలజ, విజయలక్ష్మీశర్మ వంటి ప్రముఖులతో కలిసి పాటలు పాడే అవకాశాలు లభించాయి.

"ఆల్ ఇండియా రేడియోలో నేను 'బి' గ్రేడ్ ఆర్టిస్ట్‌గా ఎన్నికయ్యాను. నా కృషిని గుర్తించి హైద్రాబాదు టి. వి. వారు టెలివిజన్‌లో లలిత సంగీతం పాడే అవకాశం కల్పించారు. ఐతే, ఇదంతా గాయనిగా నేనింకా బాగా కృషి చేయడానికి లభిస్తున్న ప్రోత్సాహంగానే భావిస్తున్నాను. నేనింకా సంగీతంలో నేర్చుకోవలసింది చాలా వుంది. అందుకే ఇంకా విద్యార్థినిగా సంగీతంలో మరిన్ని పాఠాలు నేర్చుకోడానికి కృషి చేస్తున్నాను!" అన్నారు భాగ్యలక్ష్మి.